సాక్షి అనకాపల్లి

శనివారం : 14 : జూన్ : 2025



విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి :	33.3/25.0

అనకాపల్లి: రాగల ఐదు రోజుల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు.



పుస్తకావిష్కరణ

విశాఖ సిటీ: అంబేడ్కర్ ఐడియాలజీ పుస్తకాన్ని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

'గోవాడ సుగర్స్‌కు ఊపిరి పోయండి'

చోడవరం: చెరకు రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయూ డిమాండ్ చేశాయి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఫ్యాక్టరీ నూతన మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుకు రైతు సంఘం నాయకులు జి.నాయినిబాబు, ఎస్‌వి నాయుడు, సీటు జిల్లా కార్యదర్శి వి.వి.శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో మాదిరిగానే సబ్సిడీపై చెరకు దవ్వ, ఎరువులు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరకు సాగుకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేయాలని, 2025–26 రానున్న క్రషింగ్ సీజన్‌కు వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం, ప్రస్తుతం రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ రైతుకు రూ.27 కోట్ల చెరకు పేమెంట్ బకాయిలు ఉన్నాయని, 4 నెలలకు కార్మికులకు జీతభత్యాలు చెల్లించాల్సి ఉందని, మొత్తం రూ.35 కోట్ల వరకూ ప్రభుత్వ సాయంగా అందించాలని వారు కోరారు.

కొనసాగుతున్న ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

అరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా, శుక్రవారం 801 నుంచి 1,600 వరకు సీరియల్ నంబర్లు ఉన్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దాదాపు 800 మందికి ఈ ప్రక్రియ అర్ధరాత్రి దాటినా కొనసాగింది. రాత్రి 8:45 గంటల సమయానికి సీరియల్ నంబర్ 1358 వరకు కౌన్సెలింగ్ పూర్తయింది. మిగిలిన 242 మంది అభ్యర్థులకు అర్ధరాత్రి తర్వాత కూడా కౌన్సెలింగ్ కొనసాగింది. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ శనివారం ఉదయం 1,601వ సీరియల్ నంబర్ నుంచి చివరి నంబర్ వరకు ఉన్న అభ్యర్థులందరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 8:30 గంటలకే కౌన్సెలింగ్ హాల్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

అనకాపల్లి టౌన్: మండలంలోని పిసినికాడ గ్రామం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. రూరల్ ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలు.. బవులువాడకు చెందిన ఆర్.సుబ్రమణ్యం (44), మజ్జి మంగమ్మ (40)లు ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని తిరిగి బవులవాడ వెళుతుండగా కొంకోట నుంచి అనకాపల్లి వస్తున్న లారీ బలంగా ఢీ కొంది. ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. సుబ్రమణ్యం క్వారీ కార్మికుడిగా, మంగమ్మ దినసరి కార్మికురాలిగా పనిచేస్తున్నారు. మృతదేహాలను ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించి, బంధువులకు సమాచారం తెలియజేశామన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యకర ప్రవర్తనపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: కొత్తూరు గ్రామానికి చెందిన రాజేష్ కొద్ది రోజులుగా తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు అదే గ్రామానికి చెందిన వివాహిత పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజిన్ ఆఫ్.. మీటర్ ఆన్!



- బండి షెడ్డులో ఉన్నా బిల్లు తీసేసుకుంటున్నారు
- మెకానికల్ విభాగంలో ఆయిల్ మాయ
- ప్రతీ నెలా రూ.లక్షన్నర మేర పక్కదారి
- అర్హత లేకపోయినా ఏఈ స్థాయిలో జీపు వినియోగం
- ఏడాది కాలంగా అడ్డగోలు వ్యవహారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మెకానికల్ విభాగంలో భారీ ఎత్తున ఆర్థిక అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కనీసం రోడ్లపై తిరగని వాహనం పేరుతో కూడా ప్రతీ నెలా ఆయిల్ బిల్లు డ్రా అవుతోంది. ఏఈ స్థాయి అధికారి ఏకంగా రెండు జీపుల్లో తిరుగుతున్నట్టు లెక్కలు చూపి ప్రతీ నెలా రూ. లక్ష మేర ఆయిల్ బిల్లును నొక్కేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన గత ఏడాది కాలంగా ఈ వ్యవహారం సాగుతోంది. ఇక జీవీఎంసీ నుంచి ఎస్ఈ స్థాయి అధికారి బదిలీపై వెళ్లి.. తిరిగి ఇక్కడకు వచ్చే వరకూ ఆయనే వాహనాన్ని నడుపుతున్నట్టు మరీ దోపిడికి తెగబడుతున్నారు. ఇక ఫాగింగ్ మిషన్ల ఆయిల్ బిల్లు ఏకంగా ప్రతీ నెలా రూ. 30 లక్షల మేర అదనంగా పెంచేశారు. మొత్తంగా జీవీఎంసీ మెకానికల్ విభాగంలో మాత్రం వాహనంలో ముల్లు కదలకపోయినా ఆయిల్ బిల్లు మాత్రం లక్షలకు చేరుతోంది.

ఏడాది కాలంగా...!

జీవీఎంసీ మెకానికల్ విభాగంలో జరుగుతున్న ఈ అక్రమాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. తిరుగుతున్న వాహనాలకు మాత్రమే కాకుండా, షెడ్డులో మూలకు చేరిన వాహనాలు నడుస్తున్నట్లు లెక్కలు చూపిస్తూ ఆయిల్ బిల్లులు కాజేస్తున్నారు. ఉదాహరణకు, పెద్దగా వాడకంలో లేని రెండు జీపులతో పాటు, అసలు పనిచేయకుండా నిలిచిపోయిన ఒక టాటా సఫారీ వాహనం పేరుతో ప్రతినెలా రూ. 1.5 లక్షల ఆయిల్ బిల్లులు డ్రా అవుతున్నాయి. ఈ విధంగా గత ఏడాది కాలంగా ఆయిల్ దోపిడీ జరుగుతోందని సమాచారం. అంటే, వాహనం ఆన్‌లో లేకపోయినా, జీవీఎంసీ మెకానికల్ విభాగంలోని కొందరు అధికారులు డీజిల్ బిల్లు మీటర్‌ను మాత్రం ఆన్‌లోనే ఉంచుతున్నారన్నమాట.

నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనల ప్రకారం జీవీఎంసీలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) స్థాయి అధికారికి ఎటువంటి వాహనం కేటాయించరు. కేవలం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ) స్థాయి అధికారి నుంచే వాహనాలను కేటాయిస్తారు. అయినప్పటికీ ఏడాది కాలంగా మెకానికల్ విభాగంలోని ఒక ఏఈ ఏకంగా రెండు వాహనాలను ఉపయోగిస్తూ, ప్రతినెలా ఆయిల్ బిల్లుల రూపంలో లక్ష రూపాయల వరకూ కాజేస్తున్నారని విమర్శలున్నాయి.

బదిలీ అయిన తరువాత కూడా..

ఇంకో విచిత్రమైన సంఘటన ఏమిటంటే, ఒక ఎస్ఈ స్థాయి అధికారి జీవీఎంసీలో పనిచేసి కాకినాడకు బదిలీపై వెళ్లిన తర్వాత ఆరు నెలల పాటు తిరిగి జీవీఎంసీకి వచ్చే వరకు ఆయన పేరు మీద ఉన్న వాహనాన్ని మాత్రం వెనక్కి తీసుకోలేదు. అంటే, ఆరు నెలల పాటు అక్కడ విధులు నిర్వర్తించని అధికారి పేరుతో వాహనాన్ని నడుపుతున్నారన్నమాట. మరో టాటా సఫారీ వాహనాన్ని కూడా ఇంకో అధికారి వినియోగిస్తున్నారని, గత రెండు నెలలుగా ఆయిల్ బిల్లులను భారీగా డ్రా చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

హైడ్రాలిక్ ఆయిల్, ఫాగింగ్ మిషన్ల పేరుతోనూ అక్రమాలు

హైడ్రాలిక్ ఆయిల్ కూపన్ల విధానాన్ని రద్దు చేసినప్పటికీ, ఒక్కో వాహనానికి 20 లీటర్ల చొప్పున కూపన్లను రోజువారీగా అదనంగా జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. హైడ్రాలిక్ ఆయిల్ లీటరు ధర రూ. 350 పైచిలుకు పలుకుతుంది. ఇక, ఫాగింగ్ మిషన్లు, స్ప్రింక్లర్లకు ఆయిల్ బిల్లులను అమాంతంగా రెట్టింపు చేయడంతో నెలకు రూ. 30 లక్షల మేర ప్రజాధనం పక్కదారి పడుతోంది. మొత్తంగా చూస్తే, జీవీఎంసీ మెకానికల్ విభాగంలో అవకాశం దొరికిన ప్రతిచోటా ఆయిల్ దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శలున్నాయి. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫాగింగ్ మిషన్ల పేరుతో నెలకు రూ. 30 లక్షల అదనపు దోపిడీ

ఇక ఫాగింగ్ మిషన్ల పేరుతో నెలకు అదనంగా రూ. 30 లక్షల మేర ప్రజాధనం కాజేస్తున్నట్లు విమర్శలున్నాయి. జీవీఎంసీలో 8 పెద్ద ఫాగింగ్ మిషన్లు, 80 మీడియం సైజు ఫాగింగ్ మిషన్లు, 25 స్ప్రింక్లర్లు ఉన్నాయి. వీటికి గతంలో ప్రతినెలా రూ.38 లక్షల మేర ఆయిల్ బిల్లులు చెల్లించేవారు. అయితే, డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారులు మెకానికల్ విభాగంతో కుదుర్చుకున్న 'మామూళ్ల ఒప్పందంలో' భాగంగా ఈ బిల్లును ఏకంగా రూ. 68 లక్షలకు పెంచేశారు. ఈ అక్రమ ఒప్పందానికి ప్రతిఫలంగా, ప్రజారోగ్య విభాగంలోని ఒక అధికారికి, మలేరియా విభాగానికి చెందిన మరో అధికారికి చెరో రూ. 2 లక్షల చొప్పున ప్రతి నెలా ముట్టచెప్పే విధంగా ఒప్పందం కుదిరిందని ఆరోపణలున్నాయి. ప్రతినెలా ఈ 'మామూళ్ల పంపకంలో' మలేరియా విభాగంలోని ఒక అధికారిదే కీలక పాత్ర అని తెలుస్తోంది.

పూర్తిస్థాయి విచారణ

ఈ ఆరోపణలపై మెకానికల్ విభాగం ఈఈ రత్నాకర్ రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా గత 10 రోజులుగా జీపులకు ఆయిల్ బిల్లులను నిలిపివేశామని తెలిపారు. అయితే ఈ ఆయిల్ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారం జీవీఎంసీ పరిపాలనలో పారదర్శకత లేకపోవడాన్ని, అవినీతి ఏ స్థాయిలో పాతుకుపోయిందో స్పష్టం చేస్తోంది.

సూత్రధారులు ఓ ఏఈ... మలేరియా అధికారి....!

జీవీఎంసీలో జరుగుతున్న భారీ ఆయిల్ కుంభకోణంలో మరిన్ని షాకింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఆయిల్ మాయాజాలంలో ప్రధానంగా ఒక అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) తో పాటు ప్రజారోగ్య విభాగంలోని ఒక అధికారి, మలేరియా విభాగంలోని ఒక అధికారికి కీలక పాత్ర ఉందని విమర్శలున్నాయి. తిరగని వాహనాలకు సైతం ఆయిల్ బిల్లులు దోచేస్తున్న జీవీఎంసీ మెకానికల్ విభాగం అధికారులు, కార్డుల ద్వారా మాత్రమే ఆయిల్ జారీ చేయాలనే నిబంధనను ఉల్లంఘిస్తున్నారని తెలుస్తోంది. అయితే హైడ్రాలిక్ ఆయిల్ కోసం మాత్రం 20 లీటర్ల కూపన్లను అదనంగా ఇస్తున్నట్లు సమాచారం. ఇది కేవలం కాగితాలపై మాత్రమే జరుగుతున్న వ్యవహారం అని, నిజానికి ఆయిల్ దారి మళ్లుతోందని ఆరోపణలున్నాయి.

రంగురాళ్ల తవ్వకాలకు భారీ స్కెచ్

కూటమి పాలనలో అక్రమార్కుల ఆటలు తారస్థాయికి చేరాయి. ఏడాది కాలంలో ఇసుక, గ్రావెల్, లేటరైట్, మైనింగ్ వంటి ప్రభుత్వ సంపదను దోచుకోవడమే కాక.. ఇప్పుడు ఏకంగా రంగురాళ్లపైనే కన్నేశారు. ఇందుకోసం అటవీ శాఖలో కింది నుంచి పై వరకు తమకు అనుకూలంగా ఉన్నవారిని నియమించుకుంటున్నారు. నేడో రేపో డీఎఫ్‌వోగా అస్మదీయుడినే నియమించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

- గొలుగొండ కరక క్వారీ దోచుకునేందుకు పన్నాగం
- అడ్డుకుంటారన్న అనుమానంతో అటవీ అధికారుల మార్పు
- డీఎఫ్‌వోను మార్చేందుకు కూటమి ఎమ్మెల్యే కుమారుడి సిఫార్సు లేఖ
- ఏసీబీ ట్రాప్‌లో చిక్కిన అధికారిని తెచ్చుకునేందుకు యత్నాలు



కరక క్వారీలో తవ్వకాలు జరిగేది ఈ కొండపైనే..

సాక్షి, అనకాపల్లి: నర్సీపట్నం రేంజ్ పరిధిలో గల గొలుగొండ కరక క్వారీలో లభ్యమయ్యే రంగురాళ్ల అక్రమ తవ్వకాలకు భారీ స్కెచ్ వేశారు. ఈ రంగురాళ్లకు దేశంలోనే అత్యంత గిరాకీ ఉంటుంది. కరక క్వారీలో అలెక్స్ (సిసలైన పచ్చ వైఢూర్యం) లభ్యమవుతుంది. రంగురాళ్ల తవ్వకాలు చేపట్టేందుకు ఎన్నో ఏళ్లుగా అక్రమార్కుల ముఠా ఎదురుచూస్తోంది. టీడీపీ ప్రభుత్వం వస్తేనే వీరికి అనుకూలంగా ఉంటుంది. ఈ పరిసర ప్రాంతంలోకి ఎవరైనా అక్రమార్కులు ప్రవేశించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. అందుకే గార్డు స్థాయి నుంచి ఫారెస్ట్ రేంజ్ అధికారి వరకూ ఇటీవల బదిలీలలో మార్పు చేసుకున్నారు. ఇప్పుడు డీఎఫ్‌వోగా తమకు అనుకూలమైన వ్యక్తిని రప్పించేందుకు కూటమి ఎమ్మెల్యే కుమారుడి సిఫార్సు లేఖతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అతని సిఫార్సుతోనే ఫారెస్ట్ రేంజ్ అధికారిని తెచ్చుకున్నారు. ఇప్పుడు జిల్లా ఫారెస్ట్ అధికారిని కూడా మార్చేందుకు తీవ్ర ప్రయత్నం జరుగుతోంది.

అవినీతి అధికారికి అందలం!

ప్రస్తుతం అనకాపల్లి జిల్లా డీఎఫ్‌వోగా పనిచేస్తున్న శామ్యూల్‌ను మార్పు చేసి కూటమి ఎమ్మెల్యే కుమారుడి సిఫార్స్ లేఖతో తనకు అనుకూలంగా పనిచేసే అధికారిని తెచ్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అవినీతికి మారుపేరు అయిన ఒక అధికారిని తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. సదరు అధికారి గతంలో విజయనగరంలో రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ ట్రాప్‌లో చిక్కారు. గతంలో శ్రీకాకుళంలో కూడా ఇతని మీద ఒక ఏసీబీ కేసు ఉంది. రంగురాళ్ల తవ్వకాలకు అడ్డు లేకుండా అలాంటి వ్యక్తిని నర్సీపట్నం తీసుకొస్తున్నారనే వార్త చక్కర్లు కొడుతోంది. ఆయన వీఎంఆర్‌డీ డీఎఫ్‌వోగా రావటానికి భారీ ముడుపులు ఇచ్చి ప్రయత్నం చేసినప్పటికీ.. ఏసీబీ కేసు ఉండటం వలన సంస్థ తీసుకోవటానికి ఇష్టపడలేదు. సదరు అధికారి ప్రస్తుతం విజయవాడలో పనిచేస్తున్నారు. బదిలీ జీవో నేడో, రేపో రానున్నట్లు సమాచారం.

అనుకూలస్తులనే తెచ్చుకున్నారు..!

ఈ నెల 9వ తేదీన కరక క్వారీ ప్రాంత గార్డు అయిన నవీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీనరసింహలకు ఐదేళ్ల కాలపరిమితి ముగియకపోయినా బదిలీ చేయించి, తమకు అనుకూలంగా ఉండే వారిని తెచ్చుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక్కడకు గార్డుగా వచ్చిన వ్యక్తి స్థానిక కూటమి నేతలకు బాగా పరిచయస్తుడు. ఇక్కడకు కొత్తగా వచ్చిన ఫారెస్ట్ రేంజ్ అధికారి కూడా ఈ ప్రాంత కూటమి నాయకులకు సుపరిచితుడు. ఏడాది క్రితం కేడీ పేటలో డీఆర్‌వోగా పనిచేసి ప్రమోషన్‌పై పాడేరు డివిజన్‌లో ఫారెస్ట్ రేంజ్ అధికారిగా పదోన్నతిపై వెళ్లారు. మళ్లీ నర్సీపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బదిలీపై వచ్చేశారు.



గతంలో జరిపిన తవ్వకాలు



తవ్వకాల్లో లభించిన రంగురాళ్లు (ఫైల్)

భూగర్భ శివాలయ దర్శనం అద్భుతం

- సినీ రచయిత, దర్శకుడు జె.కె.భారవి



భూగర్భ శివాలయంలో శివలింగాలను పరిశీలిస్తున్న సినీ రచయిత భారవి

నాతవరం: భూగర్భ శివాలయాన్ని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలుగు సినీ రచయిత, దర్శకుడు జె.కె.భారవి అన్నారు. గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామంలో వెలసిన శివశక్తి క్షేత్రాన్ని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఇక్కడ ప్రతిష్ఠించిన శివలింగాలు, వాటి ప్రాముఖ్యత గురించి ఆలయ ధర్మకర్త కె.ఎస్.ఎస్.శర్మ ఆయనకు వివరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత భారవి విలేకరులతో మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో చూడచక్కని విధంగా శివశక్తి క్షేత్రంలో అనేక రకాల శివలింగాలు ప్రతిష్ఠించడం చాలా ఆనందాయకమన్నారు. ఇక్కడ ప్రతిష్ఠించిన శివలింగాలు ఎంతో అద్భుతంగా దర్శనమిస్తున్నాయన్నారు. ఈ ఆలయ విశిష్టత గురించి ప్రచార మాధ్యమాల్లో చూసి ఇక్కడకు వచ్చానన్నారు. దూరప్రాంతమైనా ఇక్కడకు వచ్చిన తర్వాత, శివశక్తి క్షేత్రంలో ప్రతిష్ఠించిన పలు రకాల శివలింగాలను దర్శించుకున్న అనంతరం ఎంతో చక్కని అనుభూతి కలిగిందన్నారు. దైవ సంకల్పంతో కూడిన ఏదో తెలియని మహా శక్తి ఉంటే తప్ప ఇక్కడ భూగర్భ శివాలయ నిర్మాణం జరగదన్నారు.

జంట కనిపిస్తే వారికి కాసుల పంటే..!

కాస్త పొద్దుపోయాక బైక్‌పై ఆడామగా కనిపిస్తే చాలు.. ఈ నకిలీ పోలీసుల పంట పండినట్లే. పోలీస్ యూనిఫారంలు వేసుకుని బైక్‌లను అడ్డగించి, వారిని బెదిరించి, దోపిడీకి పాల్పడడమే వీరి దినచర్య. డబ్బులు ఇవ్వకపోతే కేసులు కట్టి పరువు తీస్తామని బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితిలో ఆయా జంటలు వారికి డబ్బులు ఇచ్చేస్తున్నారు. ఓ యువకుడు మాత్రం తెగించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ పోలీసుల దోపిడీకి అడ్డుకట్ట పడింది.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్‌కుమార్, చిత్రంలో ఏఎస్ఐ కాళీ ప్రసాద్



నిందితులు శివప్రసాద్, కందారపు గోపి

- దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్ట్
- అడవివరం–శొంఠ్యాం రోడ్డులో కాపుకాసి బలవంతంగా వసూళ్లు
- బాధితుడి ఫిర్యాదుతో చాకచక్యంగా పట్టుకున్న పెందుర్తి పోలీసులు
- నిందితుల్లో ఒకరు తొలగించిన పోలీస్ కానిస్టేబుల్

పెందుర్తి: అడవివరం–శొంఠ్యాం రోడ్డులో ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ పోలీసులను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ కె.వి.సతీష్‌కుమార్ వెల్లడించారు. విజయనగరం జిల్లా ధర్మవరం మండలం మామిడిపాలేనికి చెందిన ఏతలపాక శివప్రసాద్, నగరంలోని రైల్వే న్యూకాలనీలో నివాసం ఉంటున్న కదరాపు గోపీతో కలిసి దారి దోపిడిలు చేయడం వృత్తిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో పోలీస్ కానిస్టేబుల్ యూనిఫాంలు ధరించి అడవివరం–శొంఠ్యాం రోడ్డులో ఈ నెల 3 నుంచి 6 వరకు మాటు వేశారు. రోజూ పొద్దుపోయాక అటుగా వెళ్తున్న ప్రేమ జంటలను గమనించేవారు. వారు ఎక్కడైనా బైక్‌లు నిలిపి మాట్లాడుకోవడం, లేదా అనుమానం కలిగేలా ప్రవర్తించడం చూసి వారి వద్దకు వెళ్లి, బెదిరింపులకు దిగేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న కోరాడ జయరాం అనే వ్యక్తి గాజువాక నుంచి బైక్‌పై తనకు కాబోయే భార్యతో కలిసి విజయనగరం వెళ్తున్నాడు. సరిగ్గా అడవివరం బైరవకోన దాటాక వారిని అడ్డగించిన శివప్రసాద్, గోపి తాము పోలీసులమని చెప్పి బెదిరింపులకు దిగారు. నగదు ఇస్తే వదిలేస్తామని, లేదంటే కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని భయపెట్టారు. అయితే నగదు లేదని, ఫోన్‌పే ద్వారా ఇస్తానని చెప్పడంతో నిందితుడు శివప్రసాద్ తన వద్ద ఉన్న ఫోన్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా రూ.5 వేలు నగదు బదిలీ చేయించుకున్నాడు. వీరి తీరుపై అనుమానం వచ్చిన జయరాం అదే రోజు రాత్రి విశాఖ సీపీకి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

పది జంటల నుంచి వసూళ్లు

ఈ నెల 3 నుంచి 6 వరకు దాదాపు పది జంటల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ.2 వేలు నగదు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లతో పాటు రెండు పోలీస్ యూనిఫాంలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శివప్రసాద్ గతంలో ఏపీఎస్‌పీ 5వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసేవాడని, అతడి అనుచిత ప్రవర్తన కారణంగా 2019లో ఉద్యోగం నుంచి తొలగించినట్లు సీఐ తెలిపారు. శివప్రసాద్‌పై దోపిడి, దొంగతనం కేసులు 15 ఉండగా, అందులో 9 దోపిడీ కేసులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాయన్నారు. నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు, హెచ్‌సీ గెదెల అప్పారావు, పీసీలు రొంగలి సంతోష్‌కుమార్, ప్రగడ గణేశ్వరరావు, గాదె శంకర్రావులను ఉన్నతాధికారులు అభినందించారు.

నిందితుడు పాత నేరస్తుడే..

ఈ క్రమంలో సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు వెస్ట్ జోన్ ఏసీపీ ఏబీ పృథ్వీతేజ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ బృందం నిందితుల కోసం అన్ని కోణాల్లో గాలించారు. బాధితుడి ఫోన్‌పే ట్రాన్సాక్షన్ ఆధారంగా నిందితుల ఫోన్‌పే ఖాతాపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇదే తరహాలో దోపిడీకి పాల్పడేందుకు పోలీస్ యూనిఫాంలో పెందుర్తి మండలం సరిపల్లి చెక్ పోస్టు వద్ద మాటు వేసిన శివప్రసాద్, గోపిలను పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు.

భర్త కిరాతకం

- భార్యపై కత్తితో హత్యాయత్నం
- తెగిపడిన చేతి వేళ్లు.. శరీరంపై తీవ్ర గాయాలు
- ప్రాణాపాయ స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ
- పరారీలో భర్త రాము.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



భర్త కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన కోన దేవి

దేవరాపల్లి: భార్యపై భర్త అతి కిరాతకంగా హత్యాయత్నం చేసిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. స్థానిక రామాలయం వీధిలో శుక్రవారం వేకువజామున జరిగిన ఈ ఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎస్ఐ టి.మల్లేశ్వరరావు కథనం ప్రకారం.. దేవరాపల్లికి చెందిన కోన రాము తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతనికి 16 ఏళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన దేవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు కుటుంబ పెద్దలు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. వీరిద్దరి మధ్య గురువారం రాత్రి మళ్లీ ఘర్షణ జరిగింది. భార్య గదిలో నిద్రపోగా భర్త ఇంటి వరండాలో పడుకున్నాడు. భార్యపై కక్ష పెంచుకున్న రాము శుక్రవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న భార్య దేవిపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఉలిక్కిపడి మేల్కొన్న దేవి తన భర్త దాడి నుంచి ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ ప్రయత్నంలో ఎడమ చేతి వేళ్లు కొన్ని తెగిపడిపోగా మెడ, కాళ్లు, పొట్ట తదితర శరీర భాగాలపై కత్తి గాట్లు ఉన్నాయి. భర్త కత్తితో దాడి చేసిన విషయాన్ని సోదరుడు కృష్ణకు ఫోన్ ద్వారా దేవి చెప్పడంతో వెంటనే వారి నివాసానికి వెళ్లాడు. రక్తపు మడుగులో ఉన్న అక్క దేవిని 108 వాహనంలో కె.కోటపాడు కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం, కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ప్రస్తుతం దేవి కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కోన దేవి నుంచి పోలీసులు వాంగ్మూలం తీసుకున్నారు. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. భర్త రాము పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు.

జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా పల్లంరాజు



దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా జీవీ పల్లంరాజు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. గత నెల 31న జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన పి. శివ ప్రసాదరాజు పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్‌గా ఉన్న పల్లంరాజుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌బాబు పూర్తి అదనపు బాధ్యతలతో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్‌గా ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న కారు

గాజువాక: షీలానగర్ జాతీయ రహదారిపై ఓ కారులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కారు ఇంజిన్‌లో నుంచి పొగ వచ్చి ఒక్కసారిగా దట్టమైన మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్న తండ్రి, కుమార్తె ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు అందించిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా ఉమ్మలాడకు చెందిన ఎల్.ఎస్.వి.ప్రభాకర్ శనివారం తిరుపతి దర్శనం కోసం బయల్దేరాల్సి ఉంది. ఎన్ఏడీ కొత్తరోడ్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉన్న కుమార్తెను తీసుకొని వెళ్లడం కోసం వచ్చిన ఆయన కుమార్తెతో కలిసి కారులో ఉమ్మలాడకు బయల్దేరారు. షీలానగర్ జంక్షన్‌కు వచ్చేసరికి కారు ఇంజిన్‌లో నుంచి పొగ రావడం గమనించారు. అప్రమత్తమైన ఆయన తన తోపాటు కుమార్తెను కారులో నుంచి దింపేశారు. క్షణాల్లోనే దట్టమైన మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆటోనగర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పివేశారు.

రక్తదాత.. సుఖీభవ.!

మనిషికి శ్వాసించడం ఎంత అవసరమో రక్తం కూడా అంతే ముఖ్యం. శ్వాస ద్వారా మనం పీల్చుకున్న ఆక్సిజన్‌ను.. గుండె, మెదడు, ఊపిరితిత్తులు, కిడ్నీలతోపాటు అన్ని అవయవాలకు చేరవేసేది రక్తమే. ప్రమాదాల్లో గాయాల కారణంగా, రక్తహీనత ఏర్పడినప్పుడు, మహిళల్లో కాన్పు సమయాల్లో రక్తం ఎక్కించాల్సిన పరిస్థితులు వస్తుంటాయి. ఇలాంటప్పుడే రక్తదాతల అవసరం ఏర్పడుతుంది. ఒకరి రక్తదానం నుంచి మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చు. అందుకే రక్తదానం మహాదానంగా పరిగణిస్తున్నారు. రక్తదాతా సుఖీభవ అంటున్నారు. శనివారం(జూన్ 14) ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- రక్తదానం..ప్రాణదానంతో సమానం
- రక్తానికి ప్రత్యామ్నాయం లేదు.. దానమే మార్గం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఉన్న బ్లడ్ సేకరించే గది



అనకాపల్లిలో సర్వేజన ఐక్యవేదిక అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకులు(ఫైల్)

అనకాపల్లి టౌన్: రక్తదానం...ప్రాణదానంతో సమానం. ఏమీ ఆశించకుండా చేసే ఈ చిన్న దానమే ఏటా లక్షల మందిని కాపాడుతుంది. వైద్య రంగంలో పరిశోధనల మూలంగా ఎన్నో అధునాతన మార్పులు వచ్చినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయం ఇంకా కనుగొనలేదు. రక్తం ఒక అరుదైన వనరు. ఇది కృత్రిమంగా తయారు చేయలేని పదార్థం. కాబట్టి ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారిని కాపాడడానికి ఉన్న ఏకైక మార్గం రక్తదానం ఒక్కటే.

రక్తదానం ఎవరు చేయవచ్చు...

కనీస వయసు 18 నుంచి 65 సంవత్సరాల వరకు రక్తదానం చేయవచ్చు. బరువు కనీసం 45 నుంచి 55 కిలోలు ఉండాలి. ఒక మనిషి ఒకసారి 350 మిల్లీలీటర్ల రక్తం ఇవ్వవచ్చు. 50 కిలోల బరువు పైబడి ఉన్నవారు 450 మి.లీ రక్తం ఇవ్వవచ్చు. శరీర ఉష్ణోగ్రత 37 నుంచి 98 డిగ్రీల కంటే ఎక్కువ ఉండకూడదు. హృదయ స్పందన 60 నుంచి 100 ఉండాలి. రక్తపోటు 100 నుంచి 140, డయాస్టోల్ 60 నుంచి 90 ఉండాలి. తీవ్రమైన శ్వాసకోస వ్యాధులు ఉండకూడదు. హిమోగ్లోబిన్ కనీసం 12.5 నుంచి 38 వరకు ఉండాలి. చర్మవ్యాధులు లేని ప్రదేశంలో మాత్రమే రక్త తీయాలి. గుండె, ఊపిరితిత్తులు, పొత్తి కడుపు సర్వసాధారణంగా ఉండాలి.

ఓ నెగిటివ్ గ్రూప్‌కు డిమాండ్

ఏ పాజిటివ్, ఏ నెగిటివ్, బీ పాజిటివ్, బీ నెగిటివ్, ఏబీ పాజిటివ్, ఏబీ నెగిటివ్, ఓ పాజిటివ్, ఓ నెగిటివ్ ఇలా ఎనిమిది రక్త గ్రూపులు ఉన్నా.. ఓ నెగిటివ్ చాలా అరుదుగా లభిస్తుంది. సుమారుగా ప్రతి 10 మందిలో ఒకరికి మాత్రమే ఉంటుంది.

అనకాపల్లి పట్టణంలో బ్లడ్ బ్యాంక్ వివరాలు..

బ్లడ్ బ్యాంక్	ఫోన్ నంబర్లు
ఎన్టీఆర్ ఆస్పత్రి	97036 19706
శ్రీసూర్య అభయాంజనేయ బ్లడ్ బ్యాంక్	99511 01777, 96662 62695



రక్తం నిల్వ చేసే ఫ్రీజర్

స్ఫూర్తి ప్రదాత.. గణేష్



రక్తదానం చేస్తున్న గణేష్(ఫైల్)

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లికి చెందిన కొమ్మోజు గణేష్ రక్తదానాలతో ప్రాణదాతగా గుర్తింపు పొందారు. గణేష్ నిరంతర సేవా ఫౌండేషన్ స్థాపించి రక్తదాతలు, వలంటీర్ల సహకారంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఎంతో మందికి ప్రాణదాతగా నిలుస్తున్నారు. అంతేకాకుండా 20 సార్లు రక్తదానం చేసి ఎంతో మందిలో స్ఫూర్తి నింపారు. సొంతంగా వైద్య శిబిరాలు కూడా తరచూ నిర్వహిస్తున్నారు.

కోవిడ్ విలయ తాండవంలో సైతం

కోవిడ్ విలయ తాండవంలో సైతం గణేష్ రోగుల అవసరాన్ని బట్టి స్నేహితుల సహకారంతో రక్తం, ప్లాస్మా దానం చేపట్టారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 7 వేల మంది వలంటీర్ల సహకారంతో 40 వరకు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలు, క్యాన్సర్ పరీక్ష శిబిరాలు సొంతంగా ఏర్పాటు చేశారు. ఈ సేవలకు గాను ప్రాణదాత సేవా పురస్కారాన్ని తెలంగాణా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా గణేష్ అందుకున్నారు. అలాగే యంగ్ ఇండియన్ జాతీయ స్థాయి సేవా పురస్కారం కూడా దక్కించుకున్నారు.



తెలంగాణా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకుంటున్న గణేష్(ఫైల్)

35 రోజుల పాటే రక్తం నిల్వ



రక్తదానంపై అపోహలకు పోవద్దు. రక్తదాతలకు ప్రాథమికంగా పరీక్షలు చేసిన తర్వాతే రక్తం తీసుకుంటాం. మగవారు ప్రతి 3 నెలలకు ఒకసారి, ఆడవారు 4 నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చు. ఒక వ్యక్తి దానం చేసిన రక్తం 35 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. అందువల్ల రక్తదానం నిరంతర ప్రక్రియగా సాగాలి. స్వచ్ఛందంగా రక్తదానం చేసేవారు తక్కువగా ఉంటున్నారు. అందుకే విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. – ఎస్.కనకదుర్గ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, ఎన్టీఆర్ ఆస్పత్రి, అనకాపల్లి

ఏటా 3, 4 సార్లు రక్తదానం



మా నాన్నకు ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రిలో ఉన్న సమయంలో ఓ పాపకు రక్తం అవసరమై చాలా ఇబ్బందులు పడ్డారు. అసంఘటనతో రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నాను. నాది ఓ నెగిటివ్ గ్రూపు. 1997లో తొలిసారిగా రక్తదానం చేశాను. 2003 నుంచి ఏటా మూడు, నాలుగు సార్లు క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నాను. ఓపెన్ హార్ట్ సర్జరీకి ఓ నెగిటివ్ లైవ్ బ్లడ్ అవసరం పడుతుంది. అటువంటు వారు సంప్రదించిన వెంటనే రక్తదానం చేస్తున్నాను. – కడ్మిశెట్టి రాము, అనకాపల్లి

2017 నుంచి చేస్తున్నా..



గత ఏడు సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నాను. తొలిసారిగా 2017లో హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు చిరు బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశాను. అప్పటి నుంచి నా పుట్టిన రోజుతో నా భార్య పుట్టిన రోజు నాడు కూడా రక్తదానం చేస్తున్నా. ఇలా ప్రతి ఏడాది రెండు సార్లు రక్తం దానం చేస్తున్నాను. – కాటబత్తిన రామణ, అనకాపల్లి

48 సార్లు రక్తదానం చేశా..



1975లో 18 ఏళ్ల యువకుడు రక్తదానం చేస్తుండగా చూసి ప్రేరణ పొందాను. అప్పటి నుంచి ప్రతి ఏడాది రెండు సార్లు రక్తదానం చేస్తున్నా. ఇప్పటికి 48 సార్లు రక్తదానం చేశా. నా అనారోగ్యం దృష్ట్యా డాక్టర్లు రక్తం ఇవ్వవద్దన్నారు. దీంతో 100 సార్లు రక్తదానం చేద్దామనుకున్న నా కల నెరవేరలేదు. – పొలమరశెట్టి సత్యనారాయణ, నాగులాపల్లి

కూటమి పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం

సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక, వ్యవసాయ, నీటిపారుదల రంగం, ఉపాధి కల్పన, విద్య, వైద్య రంగం, మౌలిక సదుపాయాల కల్పనలో సాధించిన అభివృద్ధిని నియోజకవర్గాల వారీగా శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు తెలియజేయాలన్నారు. భారీ పెట్టుబడులు, లక్షలాది మందికి ఉపాధి కల్పనపై ప్రకటనలు తప్ప ఏడాది పాలనలో జిల్లాకు కొత్తగా వచ్చిన పరిశ్రమలు కంటికి ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీసి నక్కపల్లి ప్రాంతంలో ప్రైవేట్ మిట్టల్ స్టీల్‌ను ప్రోత్సహించాలన్న కుట్ర తప్ప ప్రజలకు ఎక్కడా మేలు కనిపించడం లేదన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న జీవో బుట్టదాఖలైందన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన మాట ఏడాది అవుతున్నా నిలబెట్టుకోలేదని విమర్శించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో వచ్చే సీజన్ నాటికి క్రషింగ్ నిలిపివేసే కుట్రలో ప్రభుత్వం ఉందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు ఎప్పటిలోగా పూర్తిచేసి అనకాపల్లి ప్రజలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల ఆయకట్టును స్థిరీకరించేందుకు నిధులు విడుదల చేయకుండా, రైవాడ జలాశయం ఎగువ భాగాన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అదానీకి కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఆయకట్టును దెబ్బతీసే చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. నక్కపల్లి సీహెచ్‌సీలో ట్రామా కేర్ సెంటర్, ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రిలో సూపర్ స్పెషాల్టీ విభాగాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్యం సకాలంలో అందించేలా ఎన్టీఆర్ ఆస్పత్రిని తీర్చిదిద్దాలన్నారు. తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా కాలుష్య పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసే వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడిచిపెడుతున్న పరిశ్రమలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతిపాదిత పూడిమడక ఫిషింగ్ హార్బర్, నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద ఫిష్ ల్యాండ్ సెంటర్ నిర్మాణం పనులను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీ సీఎం రమేష్ ఏడాది పాలనలో జిల్లా అభివృద్ధికి చేసిన కృషి ఏమీలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

16న అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

అనకాపల్లి టౌన్: అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు తల్లికి వందనంతో పాటు పలు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఈ నెల 16న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు, జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి కోరారు. స్థానికంగా ప్రైవేట్ హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలందరూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలన్నారు. స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇప్పుడు కోత పెట్టడం దారుణమన్నారు. నెలకు రూ.12 వేలు ఆదానం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న ప్రభుత్వం.. రూ.11.500 తీసుకుంటున్న అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ధర్నాకు పెద్ద ఎత్తున అంగన్‌వాడీ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న నాగశేషు, దుర్గారాణి

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

- 190 కిలోల కాపర్ వైర్ స్వాధీనం
- డీఎస్పీ విష్ణు స్వరూప్



నిందుతులతో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ రామచంద్రరావు తదితరులు

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు మండలాలలో గత రెండేళ్లుగా ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన 42 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను సబ్బవరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని మద్రిపాలెంకు చెందిన గరికిపాటి సాయికిరణ్,పట్నాల రాజేశ్వరరావు,మహారాణిపేటకు చెందిన నెల్ల సాయిప్రసాద్ అనే ముగ్గురు యువకులతో పాటు మరో ఇద్దరు కలిసి 2023 నవంబర్ నుంచి 2025 జూన్ వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని సబ్బవరం, ఆనందపురం, పెందుర్తి, అచ్యుతాపురం, చోడవరం, కశింకోట, యలమంచిలి, భీమిలి మండలాల్లోని ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. ఎనిమిది మండలాల్లో 42 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేయగా, అత్యధికంగా సబ్బవరం మండలంలో 15 ట్రాన్స్‌ఫార్మర్లు అపహరించినట్లు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్‌ను తొలగించి, అమ్మేసేవారని తెలిపారు.ఈ విధంగా వారు విక్రయించిన 190 కిలోల కాపర్ వైర్‌ను రికవరీ చేసినట్టు చెప్పారు. చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల విలువ రూ.54 లక్షల వరకూ ఉంటుందన్నారు.ఈ కేసుల్లో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ జి.రామచంద్రరావు,ఎస్ఐలు సింహాచలం, దివ్యలతో పాటు మిగిలిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మల్లాంలో బీజేపీలో చేరింది టీడీపీ కార్యకర్తలే

బుచ్చెయ్యపేట: మల్లాంలో బీజేపీలో చేరింది టీడీపీ కార్యకర్తలేనని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. కూటమి నేతలు కూటమి పార్టీలోనే చేరి వైఎస్సార్‌సీపీ నాయకులు చేరినట్లు ప్రకటించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పలువురు గ్రామ టీడీపీ నాయకులు ఎంపీ సీఎం రమేష్ సమక్షంలో బీజేపీ కండువాలు వేసుకోగా.. వైఎస్సార్‌సీపీ నుంచి చేరినట్లు ప్రకటన చేయడం కూటమి నేతలకు తగదన్నారు. గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ కుటుంబంలో కొంత మంది సభ్యులతో పాటు పలువురు మల్లాం, ఎంబీ పాలెం టీడీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారన్నారు. టీడీపీ మాజీ వార్డు మెంబర్ బొట్టా గోవింద్, గొలగాని కొండయ్య, గజ్జాలు, అప్పలనాయుడు, విస్సారపు ఆనంద్, చొప్పా శ్రీను, తదితరులు టీడీపీ నాయకులే తప్ప వైఎస్సార్‌సీపీసీపీ నాయకులు కాదని సర్పంచ్ బర్ల శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంబీ పాలెం రాము, భర్నికాల అయిబాబు, గంగరాజు, వాయిబోయిన అప్పలనాయుడు, గొలగాని అప్పలనాయుడు, తదితరులు స్పష్టం చేశారు. మల్లాంలో వైఎస్సార్‌సీపీకి ప్రజల సంపూర్ణ మద్దతు ఉండబట్టే సర్పంచ్‌తో పాటు 10 వార్డులు సొంతం చేసుకున్నామన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు

- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



ఎస్.రాయవరం: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు సీఎం చంద్రబాబుకు చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సాక్షి టీవీ డిబేట్‌లో విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తే కొమ్మినేనిపై కేసు ఎలా పెడతారని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించిందన్నారు. కొమ్మినేని, సాక్షి టీవీకి ఎటువంటి సంబంధం లేకపోయినా వాటిని ఆపాదిస్తూ టీడీపీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా అలజడి సృష్టించారని అన్నారు. ప్రశ్నించే జర్నలిస్టులను అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేసే దురాలోచనతో కూటమి నేతలు ఉన్నారని విమర్శించారు.

గంజాయి కలిగిన వ్యక్తికి జైలు, జరిమానా

విశాఖ లీగల్: గంజాయి కలిగిన వ్యక్తికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎన్‌వీ ప్రసాద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు తుమ్మల వెంకటేశ్వరరావు (45) వృత్తి రీత్య వ్యాపారస్తుడు. నర్సీపట్నంలో నివాసం ఉంటున్నాడు. 2021 అక్టోబర్ 14న ఎక్సైజ్ పోలీసులు నర్సీపట్నం ప్రభుత్వ కళాశాల దగ్గర గంజాయి రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో నిఘా పెట్టారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నిందితుడు 10 కేజీల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో నర్సీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు

డీఎస్సీకి 172 మంది గైర్హాజరు

ఆరిలోవ: జిల్లాలో డీఎస్సీ–2025 ద్వారా విద్యాశాఖ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్షలు ఈ నెల 6వ తేదీ నుంచి కొనసాగుతున్నా యి. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 172 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఉదయం జరిగిన పరీక్షకు ఐదు కేంద్రాలలో మొత్తం 1,642 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ఎనిమిది కేంద్రాలలో 2,337 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఉదయం జరిగిన పరీక్షకు 109 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 63 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

మత్స్య వేటకు సై!

రెండు మాసాల మత్స్య వేట నిషేధ గడువు ముగింపునకు చేరుకుంది. నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభం కానుంది. ఇప్పటికే బోట్లు, వలలకు మరమ్మతులు చేపట్టి, లంగరెత్తేందుకు గంగపుత్రులు సిద్ధమయ్యారు. ఈ రోజు రాత్రి నుంచే వేటకు వెళ్లనుండటంతో ఫిషింగ్ హార్బర్లో సందడి నెలకొంది. తమకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకుంటూ మత్స్యకారులు హడావుడిగా ఉన్నారు. బాక్సుల నిండుగా ఐస్ లోడ్ చేశారు. పక్షం నుంచి నెల రోజులకు సరిపదా వంట సామగ్రి బోటులో చేర్చారు. చిన్న చిన్న లోపాలు కూడా లేకుండా అంతా మరోసారి చెక్ చేసుకున్నారు.





– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పాల ఉత్పత్తికి మేలైన దాణా



దాణా బస్తాలను రైతులకు అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

- 50 శాతం రాయితీపై పంపిణీ
- మొదటి దఫా ఒక్కో రైతుకు 50 కేజీలు
- వివరాలు సేకరిస్తున్న పశు సంవర్ధక శాఖ

తుమ్మపాల: ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలను నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునేది పాడి పరిశ్రమే.. అందుకే పల్లెల్లో ప్రతి ఇంటి దాదాపు 90 శాతం రైతులు పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. గేదెలు, ఆవులను పోషిస్తూ పాల ఉత్పత్తి చేసి డెయిరీలకు విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో పాల ఉత్పత్తి పెరగాలంటే నాణ్యమైన దాణా ఎంతో అవసరం.. దీన్ని పశు సంవర్ధక శాఖ రాయితీపై అందిస్తోంది.

• పాల దిగుబడి పెంచేందుకు..

పశుగ్రాసం కొరత అధిగమించడం సహా పాల దిగుబడి పెంచేందుకు పాడి రైతుల కోసం 50 శాతం రాయితీపై పశువుల దాణాను అందిస్తున్నారు. రూ.1,110 ఉన్న 50 కేజీల సమీకృత దాణా బస్తాను సగానికి ధర తగ్గించి 50 శాతం రాయితీపై రూ.555కే పాడి రైతులకు అందజేస్తున్నారు. రెండు ఆవులు, గేదెలు, ఒక దూడకు 50 కిలోల బస్తా చొప్పున అందిస్తున్నారు. ఇలా మూడు దఫాలుగా బస్తాలను అంటే 150 కిలోల పశువుల దాణాను రాయితీపై అందించేందుకు పశు సంవర్ధక శాఖ రైతు సేవా కేంద్రాలు, పశువుల ఆస్పత్రుల ద్వారా రైతుల నుంచి వివరాలు సేకరించింది.

• తెలుపు రేషన్‌కార్డు తప్పనిసరి..

తెల్ల రేషన్‌కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులుగా పశు సంవర్ధక శాఖ నిర్ధారించింది. పాడి రైతులకు సంబంధించి కొన్ని అర్హతలు, నియమ నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నారు. ఒక్కో పాడి రైతుకు ప్రస్తుతానికి ఒక్క బస్తా మాత్రమే పంపిణీ చేస్తున్నారు. రైతులు రేషన్‌కార్డుతో పాటు ఆధార్ జిరాక్స్‌తో రూ.555 ముందుగా చెల్లించి నమోదు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నిష్పత్తి ఆధారంగా పశువుల దాణా కేటాయించనున్నారు.

• పెలెట్స్ రూపంలో క్రూడ్ ప్రొటీన్ దాణా...

ప్రభుత్వం అందించే సమీకృత పశువుల దాణా 20 శాతం ప్రొటీన్ కలిగి పెలెట్స్ రూపంలో 50 కేజీల చొప్పున పంపిణీ చేస్తున్నారు. అత్యంత నాణ్యమైన కల్తీ లేని దాణాను పశు సంవర్ధక శాఖ తొలిసారిగా రాయితీపై అందిస్తోంది. సగం ధరకే దాణా లభించడంతో పాటు ప్రొటీన్స్ కలిగిన దాణా అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకంతో అనేక మంది పాడి రైతులకు లబ్ధి చేకూరనుంది.

• మొదటి విడతగా 11 టన్నుల పశుదాణా

మండలంలో అన్ని గ్రామాల్లోను 163 మంది పాడి రైతులకు మొదటి విడతగా 11 టన్నుల పశువుల దాణా సరఫరా చేస్తున్నారు. మొత్తం మూడు విడతలుగా పశువుల దాణా 50 శాతం రాయితీపై అందించనున్నారు. ఇప్పటికే మొదటి విడత పంపణీ పూర్తి చేస్తూ, రెండో విడత పంపిణీకి రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఇలా సీజన్ వారీగా దాణాను పంపిణీ చేయనున్నట్లు సమాచారం.



20 శాతం క్రూడ్ ప్రొటీన్ కలిగిన పెలెట్స్ దాణా

రెండో విడత పంపిణీకి వివరాల సేకరణ



పశుగ్రాసం కొరతను అధిగమించటంతోపాటుగా నిలకడగా పాల దిగుబడి పొందేందుకు, పశువుల విక్రయాలను నిలువరించే లక్ష్యంతో పశు సంవర్ధక శాఖ ఈ పథకాన్ని అమలు చేస్తుంది. అర్హులైన పాడి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ప్రస్తుతం మొదటి విడత పంపిణీ చేస్తున్నాం. రెండో విడత పంపిణీకి వివరాలు సేకరిస్తున్నాం.

– డాక్టర్ అనిల్,
పశు వైద్యాధికారి, అనకాపల్లి మండలం

క్లుప్తంగా

విమాన ప్రమాద మృతులకు సంతాపం

అనకాపల్లి: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని రాజకీయ పార్టీ నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఘోర ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి విమానయానం చేసేవారికి సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వారు అభిప్రాయపడ్డారు. వాతావరణానికి అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే విమానాలు నడిపేటట్లు చూడాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖ అధికారులు దుర్ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి మృతులు కుటుంబాలకు రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. క్షతగాత్రులకు రూ.కోటి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, రాజాన దొరబాబు, సూదికొండ మాణిక్యాలరావు, వియ్యపు రాజు, కోరుబిల్లి శంకరరావు, బోయిన గోవింద్, మూతుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీడీవోగా ఆశాజ్యోతి



ఎంపీపీ గొర్లి సూరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన ఎంపీడీవో ఆశాజ్యోతి

అనకాపల్లి: మండల పరిషత్ అధికారిగా ఆశాజ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో కె.వి.నరసింహరావు భీమిలి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి మాట్లాడుతూ మండలంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గ్రామీణ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎంపీపీ గొర్లి సూరిబాబుకు ఆశాజ్యోతి పుష్పగుచ్ఛం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న పాండిచ్చేరి హోంమంత్రి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నమశ్శివాయ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేష వస్త్రం అధికారులు అందజేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 89 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,680	4,800
రెండో రకం	3,850	4,270
మూడో రకం	3,600	3,600

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-14, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 356 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అదనపు బ్రేకర్ పథకం పనుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, చింతలపాలెం, ఏనుగుతుని, నూతలగుంటపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరు, సోమవరం, తాళ్లపాలెం, అచ్చెర్ల, జి. భీమవరం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, పేరంటాలపాలెం, మోసయ్యపేటతోపాటు శివారు గ్రామాల్లో ఇళ్లకు విద్యుత్ సరఫరా నిర్దేశిత సమయంలో ఉండబోదన్నారు. వ్యవసాయానికి ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

రేపు గ్రీన్ క్లబ్ వార్షికోత్సవం

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 11 ఏళ్లుగా సేవలందిస్తున్న అనకాపల్లి గ్రీన్ క్లబ్ 11వ వార్షికోత్సవం ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు 'సామాజిక సమస్య-పరిష్కార మార్గాలు, ఆన్‌లైన్ వేదికలు అనే అంశంపై స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి సమాజంలో యువతకు అందించవసిన మార్గదర్శకాలు, వివిధ అంశాలపై చర్చిస్తారన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి విజయ రెసిడెన్సీ ఏసీ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 8 గంటలకు 'రక్తదాన శిబిరం' నిర్వహిస్తున్నట్లు సర్వేజన ఐక్య వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యవంతులైన యువతీ, యువకులు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు.

వర్షంతో అవస్థలు



తాళ్లపాలెం హైస్కూలుకు వెళ్లే రోడ్డు వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు



జాతీయ రహదారిపై పడుతున్న వర్షం

కశింకోట: మండలంలోని గురువారం రాత్రి, శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. కశింకోటలోని ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగేందుకు అవస్థలు పడ్డారు. తాళ్లపాలెంలోని జాతీయ రహదారి నుంచి హైస్కూలుకు వెళ్లే మార్గంలో వర్షం నీరు నిల్వ ఉండిపోవడం వల్ల విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగించడానికి ఇక్కట్లకు గురయ్యారు. కొంత కాలంగా కురుస్తున్న వర్షాల వల్ల ఆరుదల లేక బురదగా ఉండటం వల్ల ఖరీఫ్ వరి నారుమళ్లు దున్నుకోవడానికి అవకాశం లేకపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

17 నుంచి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ ఆలయ 8వ వార్షికోత్సవం ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ తెలిపారు. స్థానిక అమ్మవారి ఆలయం వద్ద వార్షికోత్సవ పోస్టర్‌ను శుక్రవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులతో 17న అమ్మవారి పెళ్లిరాట, 18 హోమం, గోపూజ, 19న దుర్గా మల్లేశ్వర స్వామివారి కళ్యాణం నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కొణతాల మురళీ కృష్ణ, కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, దాడి కృష్ణ, సూరిశెట్టి నరసింగరావు, బుద్ద భూలోక నాయుడు, కేఎం నాయుడు, పొలిమేర శ్రీను, బుద్ద సంతోష్, గండేపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు విత్తనమే కీలకం



రైతులకు అధిక దిగుబడి విత్తనం అందజేస్తున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: ప్రతి పంటలోను అధిక దిగుబడులు సాధనకు నాణ్యమైన విత్తనమే కీలకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్. ముకుందరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఖరీఫ్ విత్తన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనం ప్రాముఖ్యత, అధిక దిగుబడులునిచ్చే విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని కోరారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. డి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాత విత్తనాల మార్పిడి చేయడంలో తీసుకోవలసిన మెలకువలు ఆర్.జి.ఎల్ -2538 రకానికి ప్రత్యామ్నాయ రకాలు, జిల్లాలో వరి పండించే పరిస్థితులకు అనువైన నూతన వంగడాల గురించి వివరించారు. డాక్టర్ పి.వి. పద్మావతి విత్తన ఉత్పత్తి మెలకువలను వివరించారు. డాక్టర్ కె.వి రమణమూర్తి వరి సాగులో ఆధునిక పద్ధతులు, కలుపు యాజమాన్యం పద్ధతులను వివరించారు. డాక్టర్ సి.హెచ్ రామలక్ష్మి జీవన ఎరువుల ప్రాముఖ్యత, ఉపయోగాలను వివరించారు. డాక్టర్ బి. భవాని మాట్లాడుతూ వరి సాగులో చేపట్టవలసిన ముందస్తు సస్యరక్షణ చర్యలను వివరించారు. సమన్వయకర్తగా డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. మూలపేట, వాడ్రాపల్లి, హరిపాలెం తిమ్మరాజుపేట, తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాల నుంచి 40 మంది రైతులు హాజరయ్యారు.

జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను నియమించాలి

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను నియమించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నూకరాజు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రకు యూనియన్ నాయకులు, కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జనాభాకు తగ్గట్టుగా కార్మికులు లేకపోవటం వల్ల కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. పారిశుధ్య కార్మికులకు డ్రైవర్ డ్యూటీలు వేయరాదన్నారు. చెత్త సేకరణ ట్రాక్టర్‌కు కనీసం ముగ్గురు కార్మికులను కేటాయించాలన్నారు. వీధుల్లో చెత్తను సేకరించిన పుష్ కార్టులు ట్రాక్టర్ వద్దకు వచ్చేలా చూడాలన్నారు. కార్మికులపై మేస్త్రీల బెదిరింపులు, దూషణలు ఆరికట్టాలన్నారు. నాణ్యమైన పరికరాలు పంపిణీ చేయాలన్నారు. ఈఎస్‌టీ కార్డులు తక్షణమే పంపిణీ చేయాలన్నారు.

నకిలీ లింక్‌లతో అప్రమత్తం

కశింకోట: సైబర్ నేరాలకు కారణమయ్యే నకిలీ ఏపీకే ఫైళ్లతో సామాజిక మాధ్యమాల ద్వారా పంపే మెసేజ్‌ల పట్ల ప్రజలు, శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్‌బీఐ రివార్డ్స్ యాప్, ఇన్ కం టాక్స్ రిఫండ్ యాప్, ఎలక్ట్రిసిటీ బిల్ వేవర్ యాప్ తదితర వాటి ద్వారా నకిలీ ఫైళ్లు పంపుతారన్నారు. ఇవి అధికారిక అప్లికేషన్లు కావన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, కాంటాక్టులు, సెల్‌ఫోన్ డేటా వగైరా తెలుసుకొని దొంగిలించడానికి ఇవి ఉద్దేశించినవన్నారు. నకిలీ యాప్, ఫైళ్ల ద్వారా బ్యాంకు ఖాతాలు ఖాళీ కావచ్చునని, వ్యక్తిగత సమాచారంతోపాటు పోలీస్ శాఖ సమాచారం లీక్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఫోన్లు హ్యాక్ అవుతాయన్నారు. దీనిదృష్ట్యా అధికారులు, సిబ్బంది పలు ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసి వినియోగించాలన్నారు. ఇటువంటి అనుమానాస్పద లింకులు వచ్చిన వెంటనే సైబర్ సెల్ లేదా ఐటీ వింగ్‌కు సమాచారం అందించాలని కోరారు.

త్వరలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీలు



ఎమ్మార్పీఎస్ సమావేశంలో యలకా మల్లిబాబు

అనకాపల్లి: త్వరలో నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేస్తామని జిల్లా అధ్యక్షుడు యలకా మల్లిబాబు తెలిపారు. స్థానిక శ్రీరామ్‌నగర్ ఎమ్మార్పీస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా పోరాటం చేయడం వల్ల ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. విద్యతోనే మానవుని భవిష్యత్ ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఇన్‌చార్జి వెంకటరావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కట్టమూరి మంగరాజా, సభ్యులు మారేడుపూడి ఈశ్వరరావు, శివ, జగదీష్, కొండలరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనపై విచారణ జరపాలి



ఫార్మాసిటీలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: జేఎన్ ఫార్మా సిటీలో ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో గురువారం జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఫార్మాసిటీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సాల్వెంట్ వద్ద ఇండికేటర్‌ను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పరిశ్రమల్లో హెల్త్‌కేర్ సెంటర్‌లో ఆక్సిజన్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో భద్రత ఆడిట్‌ను నిర్వహించాలని, ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు గుమ్మాల సింహాచలం, ప్రసాద్, లోవరాజు, శ్రీను, రమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహారం



అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



అచ్చెర్ల కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు ధ్రువపత్రాలు అందజేత

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

కశింకోట: అంగన్‌వాడీ పిల్లలకు పోషక విలువలు కలిగిన భోజనాన్ని రుచికరంగా అందించడానికి కార్యకర్తల చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సూర్యలక్ష్మి ఆదేశించారు. మండలంలోని చింతలపాలెం, నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, అచ్చెర్ల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలతో మమేకమయ్యారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. భోజనానికి ముందు పిల్లలకు చేతులను శుభ్రం చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఐదేళ్ల పిల్లలను ప్రీ స్కూల్‌కు పంపి ప్రవేశాలు కల్పించాలన్నారు.. ప్రీ స్కూల్లో ఆట పాటలతో నర్సరీ కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన చేయాలని కార్యకర్తలకు సూచించారు. పిల్లలో విజ్ఞానం పెంపొందించడానికి అంగన్‌వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తల్లిదండ్రులు పంపించాలన్నారు. పౌష్టిక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తారన్నారు. టీడీ ఇంజక్షన్లు వేయించుకోవాలన్నారు. అచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రీ స్కూలులో చేరడానికి తల్లులతో ధ్రువ పత్రాలను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వంశీ ప్రియ, సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య జీవనం



యోగాసనాలు చేస్తున్న ఆలయ ఉద్యోగులు

అనకాపల్లి: యోగా చేయడం వల్ల వివిధ రకాల వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుందని పట్టణ యోగా శిక్షకురాలు బి.రోహిణి తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దుమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉద్యోగులు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విశాఖలో ప్రధాని మోదీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఉదయం, సాయంత్రం సమయంలో యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో అలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, ప్రసాద్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

16న నాగదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో ఈ నెల 16న నాగదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ప్రతినిధి వాకాడ బాబు, మద్దాల నూకరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ కమిటీ, వీధి మహిళలు పసుపుకుంకుమ, సారె ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పిస్తారన్నారు. అదేరోజు మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధ ఉంటుందన్నారు.